ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 17 జనవరి 2025

మెసేజ్ వచ్చింది.. డబ్బు పోయింది..



ముదిగుబ్బ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన నాగార్జున ఖాతాలో నుంచి రూ.32 వేలు నగదు ఈనెల 14న సైబర్ నేరగాళ్లు కాజేసినట్లు బాధితుడు వాపోయాడు. నాగార్జున ఖాతాలోకి రూ.5వేలు జమైనట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూసేసరికి రూ.32వేలు నగదు ఖాతా నుంచి మాయమైందని బాధితుడు వాపోయాడు. వెంటనే అతడు 1930 సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి, విషయం తెలిపాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.







కియ ఎదురుగా సుందరీకరణ పనులు చేస్తున్న దృశ్యం

కియ ముంగిట సెల్ఫీ స్పాట్..!

పెనుకొండ మండలంలోని అమ్మవారిపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే అంతర్జాతీయ దిగ్గజం కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. పెద్ద పరిశ్రమ, ముందు కార్లు, కార్మికులను చూసి జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు మైమరచిపోతున్నారు. రాయలసీమలో ప్రపంచ ప్రఖ్యాత పరిశ్రమను చూసి, ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాహనాలను ఆపేస్తున్నారు. పరిశ్రమను తమ ఫోన్లలో బంధించేస్తున్నారు. అంతే కాదండోయ్.. సెల్ఫీలు సైతం తీసుకుంటున్నారు. రోజూ వందల సంఖ్యలో వాహనదారులు ఆగి ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. దీంతో కియ ముందువైపున సెల్ఫీ స్పాట్‌గా మారిపోయింది. అలాంటి ప్రదేశానికి మరిన్ని సొబగులు అద్దేందుకు చర్యలు చేపట్టారు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత. సొంత నిధులతో కియ ప్లాంట్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన గ్రీన్‌పార్కు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పార్కులో వివిధ రకాల పూలమొక్కలు నాటడంతో ఆకర్షణీయంగా మారింది. ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే వారికి ఇది మరింత ఆకర్షణ కానుంది. - పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి)

మత్తులో యువత

- విశృత కలాపాలకు దిగుతున్న వైనం
- తల్లిదండ్రుల్లో ఆందోళన



ఊరూరా.. గంజాయి!

కదిరి నియోజకవర్గంలోని ఓ మండల రెవెన్యూ కార్యాలయం సమీపాన ఉన్న పలువురి వద్దకు ఇటీవల ఓ బాలుడు వచ్చాడు. తనను ఓ యువకుడు వేధిస్తున్నాడంటూ వారి వద్ద మొర పెట్టుకున్నాడు. యువకుడు గంజాయి మత్తులో వేధింపులకు పాల్పడుతున్నాడన్నాడు. దీంతో అక్కడున్న వారు.. గంజాయి ఎక్కడుందని అడగ్గా.. ఆ బాలుడు పరుగున వెళ్లాడు. ఏకంగా గంజాయి పొట్లాన్నే తీసుకొచ్చాడట. దీంతో అక్కడున్న వారు షాక్‌కు లోనయ్యారు. వారు ఫొటోలు తీస్తుండగానే.. ఆ బాలుడు భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడట. దీనిని బట్టి గంజాయి ఏ స్థాయిలో సరఫరా అవుతుందో అర్థం చేసుకోవచ్చు.



నంబులపూలకుంట/కదిరి, జనవరి16 (ఆంధ్రజ్యోతి): ఊరూరా గంజాయి సరఫరా అవుతోందన్నది బహిరంగ రహస్యమే. దీనికి యువకులు బానిసలుగా మారిపోతున్నారు. గుంపులుగా చేరి గంజాయి తీసుకుంటూ వికృత చేష్టలకు దిగుతున్నారు. దీంతో జనం భయాందోళనలకు లోనవుతున్నారు. గంజాయి వ్యాపారం సైతం జోరుగా సాగుతోంది. ఊరిబయట స్థావరాలు ఏర్పాటు చేసుకుని దర్జాగా గంజాయి వ్యాపారం సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో చాలామంది యువత గంజాయి విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విద్యార్థులు కూడా గంజాయిని విక్రయించడంతోపాటు సేవిస్తున్నట్లు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బడిలో చదువుకునే పిల్లలు కూడా గంజాయి తాగినట్లు ఉపాధ్యాయులు గుర్తించినా, వారిని దండిస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో విద్యార్థులు గంజాయి మత్తులో ఉపాధ్యాయుడిపై దాడిచేసి, హత్య చేసిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించడానికి భయపడుతున్నట్లు సమాచారం. మరికొంతమంది గంజాయి మత్తులో వాహనాలు అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. గంజాయి కట్టడిలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పోలీసు శాఖలోని కొందరు కింది స్థాయి సిబ్బందికి గంజాయి వ్యవహారాలు తెలిసినా.. మామూళ్లు పుచ్చుకుని సహకరిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ప్యాకెట్లుగా మార్చి..

నంబులపూలకుంట మండల కేంద్రతో పాటు పరిసర ప్రాంతాల్లో యువకులు గంజాయి సేవించడానికి కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. గ్రామాల సమీపంలో ఏపుగా పెరిగిన కంప చెట్లు, నీటి పరీవాహక ప్రాంతాలు, నిరుపయోగంగా మారిన ప్రభుత్వ కార్యాలయాలను కేంద్రాలుగా చేసుకున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా సరిహద్దులోని నంబులపూలకుంటను ఎంపిక చేసుకుని, గంజాయిని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో కేజీల లెక్కన కొనుగోలు చేసి, నంబులపూలకుంటకు ద్విచక్రవాహనాల్లో తీసుకొస్తున్నట్లు చర్చ సాగుతోంది. 50 గ్రా. ప్యాకెట్లుగా మార్చి రూ.500 వంతున విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒక ప్యాకెట్‌ను ఐదారుగురు యువకులు కలిసి కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా చిన్నారులను ఎంపిక చేసుకుని, వారి ద్వారా గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

గంజాయి కేంద్రాలుగా శివారు ప్రాంతాలు

విశాఖపట్నం నుంచి కదిరికి గంజాయి నేరుగా సరఫరా అవుతోంది. గతంలో కూడా అనేకమార్లు పోలీసులు దాడి చేసినా గంజాయి ప్రభావం తగ్గలేదు. కొన్ని శివారు ప్రాంతాల్లో గంజాయి దందా సాగుతోంది. కదిరిలోని బాలుర పాఠశాల మైదానంలో కొంత మంది పట్టపగలే గంజాయి సేవిస్తూ కనిపిస్తున్నారు. ఓ మద్యం దుకాణానికి సమీపంలో కూడా ఈ దందా సాగుతున్నట్లు తెలిసింది. రైల్వేస్టేషన్ అటువైపు ఎప్పుడు చూసినా గంజాయి బ్యాచ్ తిష్ట వేసి ఉంటుందని పట్టణ వాసులు వాపోతున్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో నుంచి స్టేషన్ వైపు రావడానికి మహిళలు జంకుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వచ్చిపోయేవారిని గంజాయి మత్తులో ఉన్నవారు బూతులు తిట్టడం, హేళనగా మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని శివారు ప్రాంతాల్లోని టీ స్టాళ్లలో కూడా ఇదే తంతు సాగుతోంది. రాత్రి 10 దాటిన తరువాత టీ స్టాళ్ల వద్ద గంజాయి బ్యాచ్ తిరగాడుతున్నట్లు సమాచారం. దేవరచెరువు ప్రాంతంతో విచ్చలవిడిగా గంజాయి బ్యాచ్ తిరుగుతున్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల మైదానాల్లో బహిరంగంగా మందుబాబులు విందులు చేసుకుంటున్నారు. ఉదయం నడకకు వెళ్లేవారికి బీరు, బ్రాందీ సీసాలతో స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తోంది. ఈ అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయిని నియంత్రిస్తాం

కదిరి ప్రాంతంలోని కొన్ని మండలాలతోపాటు పట్టణంలో కూడా గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉంది. సరఫరాదారులను త్వరలోనే పట్టుకుట్టాం. కదిరి సబ్‌డివిజన్‌లో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తాం.

- శివనారాయణస్వామి, డీఎస్పీ, కదిరి



బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రభుత్వ పథకాలకు విరివిగా రుణాలివ్వాలి

- బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

పుట్టపర్తి టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లా సంప్రదింపుల కమిటీ సంయుక్త సమావేశం బ్యాంకర్లతో కలిసి ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను నెలరోజుల్లో పూర్తి చేయాలన్నారు. స్టాండప్ ఇండియా పథకం కింద ప్రతి బ్యాంకు రెండు రుణాలు కచ్చితంగా మంజూరు చేయాలన్నారు. బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలన్నారు. దళితులు, రైతులు, వెనుకబడిన వర్గాల మహిళలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారో బ్యాంకర్లు ఆలోచించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొన్ని బ్యాంకులు ఒక్క రుణం కూడా మంజురు చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, బీసీ కార్పొరేషన్ డీడీ సుబ్రహ్మణ్యం, నాబార్డు ప్రతినిధి అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, మత్స్య శాఖాధికారి చంద్రశేఖర్ రెడ్డి, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, పశుసంవర్ధక జేడీ శుభదాస్, పలు బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతులు సమర్పించుకోవచ్చు

పుట్టపర్తిరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతులు సమరించుకోవచ్చని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా అనంతపురంలోని కలెక్టరేట్‌లోగల రెవెన్యూ భవనంలో ఈనెల 20వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. వినతి పత్రాలకు సంబంధించి వాస్తవాలను ధ్రువీకరించే ఒరిజనల్ పత్రాలను జత చేయాలని ఆయన సూచించారు.

పురంలో మళ్లీ కత్తి దాడి



హిందూపురం అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవలిగా కత్తుల దాడులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో మరోమారు కత్తుల దాడి జరిగింది. కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద గురువారం వ్యక్తిపై పలువురు కత్తులతో దాడి చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న రామచంద్రకు అదే ప్రాంతానికి చెందిన ఈరన్న, నగేష్, ప్రసాద్, నాగచైతన్య, నాగభూషణతో పంది మాంసం కొట్టు నిర్వహించే విషయంపై గొడవ తలెత్తింది. మాటామటా పెరిగి మూకుమ్మడిగా రామచంద్రపై కత్తులతో దాడి చేశారు. దీంతో అతడి ఛాతీపై, పక్క టెముకల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు ఆటోలో హిందూపురం ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. దాడిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితుల కోసం గాలిస్తున్నారు. వరుస కత్తి దాడుల నేపథ్యంలో పట్టణ వాసులు భయాందోళనలు చెందుతున్నారు.

ప్రపంచశాంతి వేదిక.. ప్రశాంతి నిలయం

అలరించిన భక్తి పాటలు

పుట్టపర్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికే శాంతి సందేశాన్ని అందించే వేదికగా ప్రశాంతి నిలయం పేరొందిందని శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ మూడో జోన్ సమన్వయకర్త సుధాకర్ శివబాలన్ పేర్కొన్నారు. పర్తియాత్రగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజీ దేశాలకు చెందిన భక్తులు గురువారం స్థానిక ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్‌సభామండపంలో సాయియువత సంగీత కచేరి నిర్వహించారు. మొదట మూడో జోన్ సమన్వయకర్త ప్రసంగిస్తూ.. సత్యసాయి బోధనలు, ప్రేమ తత్వం, సేవలు కోట్లాది మానవాళికి ఆదర్శం, జీవన గమనంగా మారాయన్నారు. ప్రతినిత్యం తమ దినచర్య, సత్యసాయి బోధనలతోనే ప్రారంభమవుతుందన్నారు. ఆప్తులకు అవసరమైన సేవలు అందించినపుడు వచ్చే ఆనందం అనన్యమైనదన్నారు. మూడు దేశాల్లో సత్యసాయి యువత నిరంతరం సామాజిక సేవలు చేస్తున్నారన్నారు. అనంతరం సత్యసాయి యువత శతకోటి ప్రణామ్ పేరిట కచేరి నిర్వహించారు. మధురగానంతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.





పాటలు పాడుతున్న సాయి యువత, ప్రసంగిస్తున్న సుధాకర్ శివబాలన్

నాడు .... నేడు

పెనుకొండ పట్టణం నుంచి అదే మండలంలోని కోనాపురానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండేది. వర్షం వచ్చినపుడు ఆ గోతుల్లో నీరు చేరి.. వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ గుంతల్లో కనీసం మట్టి కూడా వేయలేదు. అప్పట్లో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన శంకర్ నారాయణ రోడ్లు, రహదారుల మంత్రిగా పనిచేసినా.. రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రోడ్డు వేసి, ప్రజల ఇబ్బందులు తీర్చాలని 2022 ఆగస్టు 1వ తేదీన అప్పట్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అయిన సవిత ఆందోళన చేపట్టారు. రోడ్డు గుంతల్లో నిలిచిన నీటిలో వరినాట్లు వేసి, నిరసన తెలిపారు. అయినా.. గత వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.



రోడ్డు వేయాలని వరినాట్లు వేస్తున్న సవిత (ఫైల్)



ఎక్స్‌కవేటర్ నడిపి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రిగా సవిత బాధ్యతలు చేపట్టడంతో పెనుకొండ-కోనాపురం రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. వరినాట్లు వేసి నిరసన తెలిపిన రోడ్డు నిర్మాణానికి మంత్రి గురువారం భూమిపూజ చేశారు. ఎక్స్‌కవేటర్‌తో పనులను ప్రారంభించారు. రూ.1.52 కోట్లతో కోనాపురం రోడ్డుతోపాటు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమన్నారు. వైసీపీ ఐదేళ్లలో, కూటమి ఆరు నెలల్లో చేసిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమంటూ వైసీపీ నేతలకు సవాల్ విసిరారు.

-పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి)

లఘుచిత్రోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా



లఘుచిత్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అనంతలో నిర్వహించనున్న 7వ లఘుచిత్రోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం ఆ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లఘుచిత్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రషీద్‌బాషా మాట్లాడుతూ లఘుచిత్రోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించి నటీనటులు, దర్శక నిర్మాతలు రూపొందించిన లఘుచిత్రాలను ఈనెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు మొమెంటోలు, సర్టిఫికెట్లతో సత్కరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జీఎంఎస్ గ్యాలరీ సొసైటీ సహకారంతో రూ.50వేల వ్యయంతో అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో లఘుచిత్రం రూపొందిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల కళాకారులు సైతం తమ లఘుచిత్రాలను పోటీలకు పంపవచ్చునన్నారు. వివరాలకు 7288022467, 9676350681 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మురళీధర్, షార్ట్‌ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి రమేష్, సభ్యులు తోట బాలన్న, కత్తి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

అనంతపురం కల్చరల్/సెంట్రల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో అప్రెంటీస్‌షిప్ కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ గురువారం విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులు పదోతరగతి ఒరిజినల్, ఐటీఐ, కులధృవీకరణ పత్రం, పాన్‌కార్డు, బ్యాంకుఖాతా పాస్‌బుక్, 2 పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్సు రెండు సెట్లు చొప్పున తీసుకుని ఈనెల 21న ఉదయం 9 గంటలకు కర్నూలులోని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాలన్నారు.

ట్రేడ్‌ల వారీగా ఎంపికైన అభ్యర్థుల సీరియల్ నంబర్లు ఇలా...

డీజిల్ మెకానిక్స్: 11, 17, 33, 40, 41, 55, 58, 60, 77, 78, 83, 90, 92, 97, 98, 100, 101, 120, 131, 135, 142, 156, 157, 169, 170, 173, 184, 186, 191, 204, 208, 210, 218, 211, 224, 225, 236, 238.
మోటర్ మెకానిక్ : 4, 47, 48.
ఎలక్ట్రీషియన్ : 56, 58, 217, 235, 257.
ఫిట్టర్ : 35.
డ్రాఫ్ట్‌మ్యాన్ (సివిల్) : 15.

22న తహసీల్దారుకు అర్జీలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, జనవరి16(ఆంధ్రజ్యోతి): రెండు సెంట్ల స్థలం, రూ.4 లక్షల ఇంటి రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీన జనం తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ గురువారం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలలో ఇల్లు లేనివారికి 2 సెంట్ల స్థలంతోపాటు రూ.4 లక్షల హౌసింగ్ రుణాలను ఇస్తామని ప్రకటించిన మేరకు అర్హులైన ప్రజల నుంచి తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించే కార్యక్రమానికి తమ పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ మేరకు ఇల్లు లేనివారు రావాలని కోరారు.

డీఎల్‌పీఓ సుమన జయంతి బదిలీ



సుమన జయంతి..

అనంతపురం న్యూటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) సుమన జయంతి బదిలీ అయ్యారు. డిప్యూటేషన్‌పై బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. బుధవారం ఉత్తర్వులు జారీ కావడంతో రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో ఏఓ సోమశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ డీఎల్‌పీఓగా విజయ్ కుమార్‌రెడ్డిని నియమించే అవకాశం ఉంది.

34 కేంద్రాల్లో నవోదయ పరీక్షలు

● డీఈఓ ప్రసాద్‌బాబు



అనంతపురం విద్య, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ ప్రసాద్ బాబు గురువారం తెలిపారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ భవన్‌లో పరీక్షల విధులకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్స్, సెంట్రల్ లెవల్ అబ్జర్వర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పరీక్షలకు 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో బాలురు 4,556 మంది, బాలికలు 3431 మంది ఉన్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 15 పరీక్షా కేంద్రాల్లో, శ్రీసత్యసాయి జిల్లాలో 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ పరీక్ష ఉంటుందని అన్నారు. పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏసీ గోవింద్ నాయక్, నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీ త్యాగం.. అమరం..

మంచుకొండల్లో జవాను మృతి

ఊపిరి అందక ఆగిన గుండె
నేడు బసినేపల్లిలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



జవాను వెంకట రమణారెడ్డి (ఫైల్)

"మంచుకొండల్లో.. గడ్డకట్టే చలితో.. పోరాడింది ఆ గుండె..
ఊపిరి బిగబట్టుకుని.. హిమపాతానికి ఎదురొడ్డింది ఆ గుండె..
ఊపిరి ఆడకున్నా.. ప్రాణమే పోతున్నా.. లెక్క చేయలేదు ఆ గుండె..
దేశ ప్రజల కోసం.. పహారా కాస్తూనే... ఆగిపోయింది.. ఆ గుండె..
ఓ వీరుడా.. నీ పోరాటం.. అమరం.. నీ త్యాగం.. అమరం..



మంచుకొండల్లో మృతిచెందిన జవాను వెంకటరమణా రెడ్డి

ధర్మవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం.. దేశ ప్రజల కోసం.. మంచుకొండల్లో పహారా కాస్తూ.. జవాను అమరుడయ్యారు. ధర్మవరం పట్టణం నాగులబావి వీధికి చెందిన బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణా రెడ్డి(40) విధి నిర్వహణలో ఈనెల 15న గుండెపోటుతో మృతిచెందారు. వెంకటరమణారెడ్డి 2003లో బీఎస్ఎఫ్‌లో చేరారు. 22ఏళ్లుగా పనిచేస్తున్నారు. కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందారు. ఉష్ణోగ్రతలు పడిపోయి, ఊపిరి అందక మృతిచెందినట్లు బీఎస్ఎఫ్ అధికారులు.. బంధువులకు సమాచారం. వెంకటరమణారెడ్డికి భార్య హరిప్రియ, కుమారుడు మహీధర్ రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణారెడ్డి పార్థివదేహం గురువారం రాత్రి ధర్మవరం పట్టణానికి చేరుకుంది. కశ్మీర్ నుంచి బెంగళూరుకు ఆర్మీ అధికారులు ఆయన పార్థివదేహాన్ని తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిలటరీ వాహనంలో ధర్మవరానికి తరలించారు. మరికొన్ని రోజుల్లో రిటైర్ కానున్న ఆయన ఇలా మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. వెంకటరమణారెడ్డి స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి కాగా.. కొన్నేళ్లుగా ధర్మవరంలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం బసినేపల్లిలో అధికార లాంఛనాలతో జవాను అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ముందు చూపు ఏదీ..?

వంకల పాలవుతున్న కుడికాలువ నీరు



కుడికాలువ నుంచి వృథాగా బయటకు వెళ్తున్న నీరు

ఇరిగేషన్ అధికారుల ముందుచూపు లేక కుడికాలువలో నీరు పెద్ద ఎత్తున్న వృథాగా వంకల పాలవుతోంది. కుడికాలువకు నిర్మించిన యూటీ (అండర్ బ్రిడ్జి)లకు పెద్ద ఎత్తున్న రంధ్రాలు పడి నీరు బయటకు వెళ్తోంది. పీఏబీఆర్ డ్యాం నుంచి 30 కిలోమీటర్లలోపు ఉన్న యూటీల నుంచి నీరు వృథా అవుతోంది. డ్యాం సమీపంలోని బుడగొని వంక, హంసపల్లి, జల్లిపల్లి గ్రామాల మధ్య గౌరవయ్య దార్ల వంకల వద్ద నీరు భారీగా బయటకు వెళుతోంది. అధికారులు నీటి వృథాను అరికట్టడంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఏబీఆర్‌లోకి తుంగభద్రం డ్యాం నుంచి 530 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇన్‌ఫ్లో ఆధారంగా కుడికాలువకు 705 క్యూస్కెల నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. కాలువపై పర్యవేక్షణ లేకపోవడంతోనే లీకేజీలను గుర్తించలేకపోయారన్న వాదనలు వినవస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, కూడేరు

మద్యం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

గోరంట్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయి సోమశేఖర్‌కు పెనుకొండ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ గురువారం తెలిపారు. 2020 జూలై 18న కర్ణాటకలోని మార్గానికుంట్లకు చెందిన సోమశేఖర్ 122 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు తీసుకెళ్తుండగా అప్పటి సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టుచేసి, కేసు నమోదు చేశారు. పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణలు సాగాయి. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి బొజ్జప్ప మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

రేపు కర్ణాటక సంగీత కచేరి

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని విజయవాణి సంగీత కళాశాల ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం కర్ణాటక సంగీత కచేరీ నిర్వహిస్తున్నామని కళాశాల నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ గురువారం తెలిపారు. త్యాగరాజస్వామికి శనివారం ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, సంగీత విద్వాంసులచేత సామూహిక పంచరత్న గాన సేవలు ఉంటాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు తమిళనాడుకు చెందిన అక్కచెల్లెళ్లు కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహిస్తామని తెలిపారు.

పురం వైసీపీలో కన్వీనర్ల చిచ్చు

ఏకపక్ష నిర్ణయంపై ఒక వర్గం గుర్రు



పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసిన నాయకులు
ఇప్పట్లో ఇన్‌చార్జి మార్పు లేనట్లేనా?

హిందూపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీలో మండల కన్వీనర్ల చిచ్చు మరోసారి తెరపైకి వచ్చింది. మొన్నటి వరకు ఉన్న కన్వీనర్లను పక్కన బెట్టి వైసీపీ పురం ఇన్‌చార్జి దీపిక వర్గానికి చెందిన నాయకులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ఏకపక్షంగా సాగిందనీ, కన్వీనర్ అంటే ఏమిటో విలువ తెలియకుండా పదవులు అప్పగించారంటూ మరోవర్గం నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. నియోజకవర్గంలో మూడు మండలాలు, పట్టణం ఉంది. ఇందులో పట్టణానికి సంబంధించి కన్వీనర్లతో పాటు మూడు మండలాలకు కన్వీనర్లను ఎంపిక చేశారు. వీరిలో అందరూ దీపిక వర్గం వారే. నవీన్‌నిశ్చల్ వర్గీయులు ఒక్కరు కూడా లేరని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లేపాక్షి మండల కన్వీనర్ విషయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇచ్చిన మాట కూడా బేఖాతరు చేస్తూ మరొకరికి ఇచ్చారని నవీన్ వర్గీయులు రగిలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నవీన్ వర్గీయులు కొంత మంది ఎంపీ మిథున్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసి ఎంపీపీ విషయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చాయో బయటకు పొక్కడంలేదు. ఇప్పట్లో ఇన్‌చార్జి మార్పు లేదంటూ చర్చించుకుంటున్నారు. మార్పు చేస్తే ప్రస్తుతం ఎంపిక చేసిన కన్వీనర్లు తప్పించే ఆస్కారం లేనట్లే.

పార్టీని వ్యతిరేకించినా..

నియోజకవర్గంలో మూడు మండలాలు, ఒక పట్టణానికి సంబంధించి ఐదుగురు కన్వీనర్లను ఎంపిక చేశారు. ఆ జాబితాను ఈనెల 10న అదిష్టానం ప్రకటించింది. ఈ పేరును ముందస్తుగా అదిష్టానానికి పంపగా.. అదిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హిందూపురం రూరల్ మండల కన్వీనర్ మినహాయించి నలుగురూ కొత్త వారే. ఇందులో ఒకరిద్దరు కన్వీనర్లు పార్టీకి పెద్దగా కష్టపడిన దాఖలాలు లేవని కొంతమంది పార్టీకి వ్యతిరేకించినా అలాంటివారిని ఎంపిక చేయడం ఏంటని ఎంపీ మిథున్‌రెడ్డి వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఇందులో ఒక కన్వీనర్ వైసీపీ అధికారంలో ఉన్నపుడు విచ్చలవిడిగా వ్యవహరించారనీ, అతడి వల్ల పార్టీకి చెడ్డపేరు వచ్చిందని అలాంటి వ్యక్తిని ఎంపిక చేయడం ఏంటని వాపోతున్నారు. ఇప్పటికే సదరు నాయకుడిని సొంత పార్టీ నాయకులే టార్గెట్ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆయన చేసిన దందాలు, దౌర్జన్యాలు మరిచిపోలేదు. దీంతో అలాంటి వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని సొంత పార్టీ నాయకులే అంటున్నారు. దీంతోపాటు ఓ మండలానికి సంబంధించి ఓ నాయకుడిని సుదీర్ఘ కాలంగా కన్వీనర్ పదవి ఊరిస్తోంది. ఆయన 2013 నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. అతడిపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు ముందు అతడిని కన్వీనర్ చేస్తారని అప్పట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూడా ఆయనను కన్వీనర్ చేస్తారని ఆశించారు. ఈ పరిస్థితుల్లో మండల కన్వీనర్ తనకు పదవి వద్దని ఆ నాయకుడికి ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతో అతడికి కన్వీనర్ పోస్టు ఇవ్వడానికి లైన్ క్లియర్ అయిందని భావించారు. ప్రస్తుత ఎంపికలో అతడి పేరు లేదు. మరో మండలానికి చెందిన కన్వీనర్ ఎంపికలో కూడా ఏకపక్షంగా వ్యవహరించారని స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. సదరు నాయకుడు విచ్చలవిడిగా వ్యవహరించారు. ఈ పరిస్థితుల్లో అతడి ఎంపిక మెజార్టీ నాయకులకు మింగుడు పడటంలేదు. ఆయన కన్వీనర్‌గా ఎలా రాణిస్తారో వేచిచూడాల్సిందే.

మార్పు లేనట్లేనా?

ఇటీవల ఓ వర్గం నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో కన్వీనర్ల ఎంపికపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ సందర్భంగా పురంలో వైసీపీ ఇన్‌చార్జిని మార్చాలని అడిగినట్లు సమాచారం. ఇప్పట్లో ఇన్‌చార్జిలను మార్చే ఉద్దేశంలేదనీ, 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌చార్జిల మార్పు ఉంటుందని అంతవరకు ఆగాల్సిందేనంటూ సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఓ వర్గం నాయకులు నియోజకవర్గ విభజన జరిగితే తమ నాయకుడికి అవకాశం వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు సదరు నాయకుడికి ఇన్‌చార్జి పదవికోసం తీవ్రంగా శ్రమిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎంపీ మాటలతో ఆ వర్గంలోని నాయకులకు నిస్సహాయత నెలకొంది. ఈ పరిస్థితుల్లో కన్వీనర్ల ఎంపిక ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న చర్చ సాగుతోంది.

రోడ్డు భద్రత మాసోత్సవాలను పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్



రోడ్డుభద్రత మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు, అసిస్టెంట్ కలెక్టరు ఇతర అధికారులు

అనంతపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డుభద్రత మాసోత్సవాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలలో ఒక ప్రాణం పోయినా తిరిగి రాదని, ఆ కుటుంబం అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అందుకే రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫిబ్రవరి 15వరకు మాసోత్సవాలను పక్కా ప్రణాళికతో చేపట్టాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని, అతివేగంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపేవారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్‌స్పాట్‌లను జాయింట్ యాక్షన్ కమిటీ పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 24న డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేయించాలని, 25న ప్రమాదాల నివారణ కార్యక్రమాల నిర్వహణ, 26, 27 తేదీలలో ప్రజాప్రతినిధులతో కలిసి వాకథాన్, 30, 31న ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, డీటీసీ వీర్రాజు, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్టీఓలు లక్ష్మీనారాయణ, రమేష్, ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ జుత్తు కత్తిరింపుపై ఎస్పీ సీరియస్



పెనుకొండ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళ జుత్తు కత్తిరింపుపై ఎస్పీ రత్న సీరియస్ అయ్యారు. మండలంలోని మునిమడుగు గ్రామంలో ప్రేమ జంటకు సహకరించిందన్న అనుమానంతో వెంకటలక్ష్మిపై యువతి బంధువులు దాడిచేసి, జుత్తును కత్తిరించిన విషయం తెలిసిందే. దీనిపై బాధితురాలు కియ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై జిల్లా ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించారు. దీంతో ఎస్పీ గురువారం మునిమడుగు గ్రామంలో పర్యటించారు. వివరాలను ఆరాతీయడంలో నిమగ్నమయ్యారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదు: రాఘవన్, సీఐ

మునిమడుగులో మహిళ జుత్తు కత్తిరించడంపై 13 మందిపై కేసు నమోదు చేశాం. పూర్వాపరాలను పరిశీలిస్తున్నాం. త్వరలో నిందితులను అరెస్టు చేస్తాం. దీని వెనుక ఎంతటివారున్నా ఉపేక్షించే ప్రసక్తే లేదు.

కఠినంగా శిక్షించాలి: ఐద్వా

అనంతపురం కల్చరల్: పెనుకొండ మండలంలో మహిళను వివస్త్రను చేసి, జుట్టు కత్తిరించినవారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి గురువారం డిమాండ్ చేశారు. ప్రేమజంటకు సహకరించారనే నెపంతో మహిళను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించడం అనాగరికమని అన్నారు. ఆమె తప్పు చేసివుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా చేయడం మహిళలను అవమానించడమేనని అన్నారు. దాడిచేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆమెకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళనకరమని అన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని, ఈ ఘటనపై ఎస్పీ సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆ జీఓతో వేతనం వెతలు

అడ్డగోలుగా 'వైసీపీ' జీవో 11 అమలు
గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులకు చుక్కలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తీసుకున్న నిర్ణయాలు పంచాయతీ కార్యదర్శులకు చుక్కలు చూపుతున్నాయి. చాలామంది నెలల తరబడి వేతనం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. బాధిత సిబ్బంది డీపీఓ చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉండేలా వైసీపీ ప్రభుత్వం జీఓ నంబర్ 11ను జారీ చేసింది. చాలా చోట్ల ఈ జీవో అమలు కాలేదు. కానీ జిల్లాలో అప్పటి డీపీఓ ప్రభాకర్‌రావు అమలు చేశారు. గ్రేడ్-5 కార్యదర్శులను డీడీఓ పవర్ ఉండే స్థానంలో నియమించే వెసులు బాటు లేదు. అయినా గ్రేడ్-4 అడిషినల్ పేరుతో నియమించారు. దీంతో బదిలీల ప్రక్రియలో సీనియర్ సెక్రటరీలు బలయ్యారు. రెండు నెలలు వేతనం లేక ఇబ్బందులు పడ్డారు. సీనియర్‌లు తిరిగి డీడీఓలుగా చేరడంతో 'గ్రేడ్-4 అడిషినల్' కింద వచ్చినవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో డీడీఓ పవర్ ఉన్న సీనియర్ సెక్రటరీలు బదిలీల్లో భాగంగా నియమితులైన వారిని ఎగ్జిట్ చేశారు. వారికి మరోచోట స్థానం లేక వేతనం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఐదు నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు.

పరిష్కారం ఎప్పుడు..?

వేతనం తీసుకోలేని వారు గ్రేడ్-4 అడిషినల్ కింద 73 మంది ఉన్నారు. జిల్లాలో 1044 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 500 లోపు జనాభా ఉన్నవి నాలుగు పంచాయతీలు. ఇవి మినహా 1040 గ్రామ పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శులు 49 మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 18 మంది, గ్రేడ్-3 కార్యదర్శులు 115 మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 368 మంది ఉన్నారు. వీరిలో ఎవరికి డీడీఓ పవర్స్ ఇచ్చి బదిలీ చేసినా సమస్యలు వచ్చేవి కావు. కానీ గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4 అడిషినల్ కింద చూపించి బదిలీలు చేపట్టారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ కార్యాలయానికి ఫైల్ పంపి, అక్కడి అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి. కానీ ఆ పనినీ వాయిదా వేశారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి గురువారం తీసుకెళ్లినట్లు తెలిసింది. కలెక్టర్ ద్వార కమిషనర్ కార్యాలయానికి సిఫార్సు చేయించి, సమస్యను పరిష్కరిస్తారా, లేదా.. చూడాల్సి ఉంది.

న్యూస్ బాక్స్..

సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పుట్టపర్తిటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెపల్లి ఉత్తప్ప, పలువురు వడ్డెర నాయకులు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. కొండ క్వారీల్లో తమకు 35 శాతం రాయితీ ఇవ్వాలని, ప్రతి మండల కేంద్రంలో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, క్వారీల్లో ప్రమాదాల వల్ల గాయపడిన, చనిపోయిన వడ్డెర్లకు రూ.పదిలక్షల ప్రమాద బీమా మంజూరు చేయాలని కోరారు. 50 యేళ్లు నిండిన వడ్డెర్లకు పింఛన్ మంజూరు చేయాలని, ప్రభుత్వ పనుల్లో 15నుంచి 20శాతం తమకు కేటాయించాలని కోరారు. వారి వెంట వడ్డెర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బోగుల చక్రపాణి, జాతీయ ఉపాధ్యక్షుడు పల్లపు జయచంద్ర, దండగల మారెప్ప, ఎర్రవంకపల్లి గంగులప్ప, గంగ రాజు ఉన్నారు.

● పనులు సత్వరమే పూర్తి చేయండి

వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలోని పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. నేషన్ హైవే, రైల్వే, ఆర్అండ్‌బీ, నీటి పారుదల, అటవీశాఖ, భూసేకరణ తదితర అంశాలపై ఆయాశాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయా లన్నారు. వారంలోపు భూ సమస్యలను పరిష్కరించాలని, సందే హాలుంటూ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అన్నారు. చాగలేరు గ్రామస్థులతో మాట్లాడి భూగర్భ మార్గం సమస్యను పరిష్కరించాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవేలకు అటవీ భూముల కేటాయిం చడానికి ఆ శాఖధికారులు త్వరగా అనుమతులు ఇవ్వాలన్నారు. ఎన్‌హెచ్342 హైవే రహదారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్, నేషనల్ హైవే పీడీ అశోక్‌రెడ్డి, హైవే అధికారులు ముత్యాలరావు, మైన్స్ అధికారి పెద్దిరెడ్డి, భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ధర్మవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట ఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఫిబ్రవరి 8,9 తేదీల్లో ఏడో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఉషోదయ స్కూల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. టోర్నీకి ముఖ్యఅతిథులుగా ఏపీ స్టేట్ చెస్ అసోషియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా చెస్ అసోషియేషన్ కార్యదర్శి రవిరాజ్, టోర్నీ ప్రెసిడెంట్ డాక్టర్ బీవీ సుబ్బారావు హాజరవుతారన్నారు. టోర్నీ మొత్తం నగదు బహుమతి రూ.60 వేలు ఉంటుందన్నారు. ఈ చెస్ టోర్నీ ఏపీ స్టేట్ అసో షియేషన్ కార్యదర్శి సుమన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9912647370, 08559-2218132 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి శ్రీకారం

ముదిగుబ్బ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ పట్టణంలో 11 కేవీ పాత విద్యుత్ స్తంభాలు, పాత కేబుల్ వైర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆ విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. గురువారం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, ట్రాన్స్‌కో అధికారులు భూమిపూజ నిర్వహించి.. పనులు ప్రారంభించారు. దీంతో వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీ సమస్య తీరుతుందని అధికారులు తెలిపారు.

తాగునీటి ట్యాంక్ వద్ద అపరిశుభ్రత



ట్యాంక్ వద్ద నిలువ ఉన్న మురుగునీరు

గాండ్లపెంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలోని కత్తివారి పల్లి తాగునీటి ట్యాంక్ వద్ద మురుగునీరుతో అపరిశుభ్రత నెలకుంది. ట్యాంక్‌ల వద్ద పంచాయతీ అధికారులు మురుగునీరు నిలువ లేకుండా ఉండేలా చూడాల్సి ఉంది. అయితే పంచాయతీ అధికారులు పట్టిం చుకోకపోవడంతో మురుగునీరు నిలువ ఉండడంతో అపరిశుభ్ర నెలకుంది. దీంతో తాగునీరు కలుషితం అవుతోంది. అంతేకాకుండా దోమలు వృద్ధిచెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే మండల వ్యాప్తంగా పంచాయతీల్లో ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా... పంచాయతీ అధికారులు ఆ ఆదేశాలను గాలికి వదిలేశారు.

కిశోరి వికాసంపై శిక్షణ



కిషోరి వికాసంపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

తనకల్లు జనవరి, 16(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై గురువారం శిక్షణ నిర్వహించారు. మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులకు ఈ శిక్షణ నిర్వహించారు. బాల్యవివాహాలను నిరోధించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం కిషోరి వికాసంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, సీడీపీఓ గంగరత్న, జిల్లా కౌన్సిలర్ శివలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, సమత సంస్థ ప్రతినిధి శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి

మడకశిరటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తు న్నాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో యువతకు శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో ప్రతినెలా రూ.5వేలు ఆర్థిక సహాయం అందించి, ఎంపికైన వారికి రూ.6వేలు వన్‌టైం గ్రాంట్‌ను సైతం అందించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షేమం.. నిస్తేజం..!

- మార్కెట్ కమిటీలకు నిధుల లేమి
- మంజూరు చేయని గత వైసీపీ ప్రభుత్వం
- నిరుపయోగంగా గోదాములు, కల్లాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- సేవలు అందక రైతుల పాట్లు
- 'రైతుబంధు' కోసం నిరీక్షణ



కొత్తచెరువు మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న కల్లాలు

కొత్తచెరువు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీలు నిధుల లేమితో నిస్తేజంగా మారాయి. సత్యసాయి జిల్లాలో ఎనిమిది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ చేసుకోవడానికి వీలుగా 30 గోదాములు, రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి వీలుగా 22 రేకులషెడ్ ప్లాట్ ఫారాలను, పెద్దపెద్ద కల్లాలను గతంలో నిర్మించారు. వీటి నిర్వహణ, మరమ్మతులకు గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిధులు కేటాయించలేదు. దీంతో కమిటీల అభివృద్ధి కనుమరుగైంది. రైతులు అందాల్సిన సేవలు ఆగిపోయాయి. గత వైసీపీ పెద్దలు, నాయకులకు మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు కట్టబెట్టడంపై ఉన్న శ్రద్ధ మార్కెట్ కమిటీలకు నిధుల మంజూరుపై శ్రద్ధ చూపలేదు. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన గోదాములు, కల్లాలు శిథిలావస్థలకు చేరుకుంటున్నాయి. కొత్తచెరువు మండల కేంద్రంలో 2014 లో రూ. కోటితో గోదాం నిర్మణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణం శ్లాబ్ వరకు వచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆ గోదాం నిర్మాణం గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆగిపోయిన గోదాంకు పైకప్పు వేసి వినియోగంలోకి తీసుకు రావాలని కూటమి ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

● దుర్వినియోగం...

కొన్ని మండల కేంద్రాల్లో ఉన్న మార్కెట్ కమిటీల కార్యాలయాలు, గోదాములు, రేకుల షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. కొత్తచెరువు, కదిరి, గోరంట్ల, హిందూపురం మార్కెట్ యార్డులకు రక్షణగా ఉన్న మల్లకంచెలను, ప్రహరీలను అకతాయిలు కూల్చేశారు. దీంతో మందు బాబులకు, గంజాయి బ్యాచ్‌లకు నిలయంగా మారుతున్నాయి. కొత్తచెరువులో ఉన్న గోదాములను గతంలో హౌసింగ్ సిమెంట్, ప్రభుత్వ పాల డెయిరీకి, ప్రభుత్వం రైతులకు అందించేందుకు వేరుశగ విత్తనకాయలు, స్ప్రింక్లర్ పైపుల నిల్వ చేసుకోవడానికి అద్దెకు ఇచ్చారు. కొందరు అకతాయిలు, ఆ గోదాముల షెట్టర్ తాళాలను పగలగొట్టి వాటిని ఎత్తుకుపోయారు.

● 'రైతుబంధు' కోసం నిరీక్షణ

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేసింది. ఈ పథకం ద్వారా రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డుల్లోని గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ పథకం కింద నిల్వ ఉంచిన ధాన్యంపై మార్కెట్ కమిటీలు రైతుకు 60 శాతం వరకూ నామ మాత్రపు వడ్డీతో రుణాలను అందించేవారు. రైతు మార్కెట్‌లో మద్దతు ధర ఎక్కువగా ఉన్నప్పుడు నిల్వ ఉంచిన ధాన్యాన్ని విక్రయించి రుణాన్ని తీర్చేవారు. దీంతో రైతుకు కొంత ఆర్థిక వెసులుబాటు దక్కేది. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఉచితంగా మందులను సైతం అందించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుబందు పథకాన్ని అమలు చేయలేదు. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తిరిగి రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

● ఆగిన ఆదాయం

జిల్లాలో ఉన్న ఎనిమిది మార్కెట్ కమిటీల ద్వారా ఏడాదికి రూ.ఐదు కోట్ల పైచిలుకు ఆదాయం ప్రభుత్వానికి వచ్చేది. ప్రభుత్వం మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేస్తే మరింత ఆదాయం వస్తుంది. రైతులకు మార్కెట్ కమిటీల ద్వారా తిరిగి రైతుబందు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే మరింత ఆదాయం ప్రభుత్వానికి చేకూరే అవకాశం ఉంటుంది. కొత్తచెరువు మార్కెట్ యార్డు స్థలం ధర్మవరం వెళ్లె ప్రధాన రహదారి పక్కనే ఉంది. ఈ రహదారి వెంబడి దాదాపు 60 షాపింగ్ కాంప్లెక్సు గదులు నిర్మించవచ్చు. తద్వారా ప్రభుత్వానికి వాటి ద్వారా రూ.లక్షల్లో ఆదాయం చేకూరే అవకాశం ఉంది. కనీసం కూటమి ప్రభుత్వ మైనా తమను ఆదుకునేలా ఇలాంటి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కొత్తచెరువులో పైకప్పులేని గోదాము



చిలమత్తూరులో శిథిలావస్థలో ఉన్న గోదాము

కంపచెట్లు తొలగించరూ..



ధర్మవరంరూరల్ జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పేపల్లి నుంచి రావుల చెరువు గ్రామానికి వెళ్లే రహదారికి ఇరుపక్కలా భారీగా కంపచెట్లు పెరిగాయి. కంపచెట్లు పెరిగిపోవడంతో ద్విచక్ర వాహన దారులకు కంపలు గీసుకుని గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోందని గ్రామీణులు వాపోతున్నారు. అధికారులు ఆ కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

← రహదారి పక్కన భారీగా పెరిగిన కంపచెట్లు

కుక్కల సంచారంతో ప్రమాదాలు



గాండ్లపెంట ప్రధాన రహదారిలో సంచరిస్తున్న కుక్కలు

గాండ్లపెంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిలో గుంపులు గుంపులుగా వీధికుక్కలు సంచరిస్తుండడంతో ద్విచక్రవాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో, వీధుల్లో, పలు గ్రామాల్లో వీధి కుక్కలు అధికమయ్యాయి. నిత్యం రద్దీగా ఉన్న ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనదారులకు ఒక్కసారిగా అవి అడ్డు వస్తుండటంతో పలువురు ప్రమాదాలకు గురై కాళ్లు చేతులు విరిగిన సంఘటన లున్నాయి. అలాగే పలువురు చిన్నారులపై కుక్కలు దాడులు అధికమయ్యాయి. గాండ్లపెంటలో గత యేడాది కుక్కలను రూ.1.50 లక్షల దాకా ఖర్చు చేసి.. వాటిని పట్టుకుని దూరంగా వదలకుండా దగ్గరలో వదలడంతో తిరిగి మండలానికి చేరాయి. కుక్కల సంతానం వృద్ధి చెందడంతో ఏ వీధిలో చూసినా రాత్రిలో సంచరించాలంటే భయాందోళ చెందుతున్నారు. ఏప్పుడు ఎక్కడ నుంచి వచ్చి కరుస్తాయో అని భయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

పెనుకొండ: నాదబ్రహ్మ త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలను శనివారం స్థానిక సర్వశెట్టి కన్వెన్షన్ హాల్‌లో వృషభాద్రి గాన బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరాధనోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 6గంటలకు కర్ణాటక శాస్త్రీయ సంగీత గానకచేరి ఉంటుందని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన క్రికెట్ టోర్నీ

నంబులపూలకుంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న కందికుంట నారాయణమ్మ క్రికెట్ టోర్నమెంటు గురువారంతో ముగిసింది. గురువారం ఫైనల్‌లో లేవన్ లడ్డు, క్రేజీ లేవన్ టీమ్‌లు తలపడ్డాయి. మొదట క్రేజీ లేవన్ టీమ్ 102 పరుగులు చేయగా, లేవన్ లడ్డు ఆ లక్ష్యాన్ని ఛేదించి.. విజయాన్ని సాధించింది. విజేత జట్టుకు రూ.20వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు అందించారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, మౌలాసాబ్, మగ్గం రామాంజి, ఉపాధ్యాయులు రామాంజులయాదవ్ నగదు బహుమతులు అందించారు.

రేపు రక్తదాన శిబిరం : ఎమ్మెల్యే కందికుంట



కదిరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో మాట్లాడుతూ... శనివారం ఉదయం 8.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తామన్నారు. అనంతరం ర్యాలీగా పీవీఆర్ గ్రాండ్‌కు చేరుకుని, రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. సమాజ సేవకులు, ఔత్సాహికులు రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు భద్రత వారోత్సవాలు

పుట్టపర్తిటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి జిల్లా రీజనల్ మేనేజర్ మధుసూధన్ రోడ్డు ప్రమాదాల నివారణపై స్థానిక డిపోలో గురువారం అవగాహన కల్పించారు. డ్రైవర్లు వ్యసనాలకు దూరంగా ఉండాలని, బస్సులు నడిపే సమయంలో ఫోన్ మాట్లాడకూడదని అన్నారు. జిల్లాలో ప్రమాదరహిత ప్రయాణం అందించడానికి ప్రతి ఆర్టీసీ ఉద్యోగి కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ట్రాఫిక్ ఇన్‌చార్జీ హరిత, గ్యారేజీ ఇన్‌చార్జీ విజయానంద్ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను గురువారం పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి ప్రారంభించారు. రహదారి భద్రత సూచనలు తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. లైసెన్సులున్నవారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మురళి, ఎంవిఐ వరప్రసాద్, సీఐ నాగేంద్ర, వాహన డ్రైవర్లు ఉన్నారు.

● తనకల్లు : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ గోపి జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాల్లో హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.



పుట్టపర్తి : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం



కదిరి : కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

క్రైం న్యూస్ ..

అదుపు తప్పిన కారు



ఒరిగిన విద్యుత్ స్తంభం

గాండ్లపెంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోని రెక్కమాను వద్ద ఓ కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని గురువారం ఢీకొంది. కదిరి సమీపంలోని మూర్తిపల్లికు చెందిన ఓ వ్యక్తి కారులో గాలివీడుకు బయలుదేరాడు. రెక్కమాను వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. గమనించని అతని కారులో అతివేగంగా వెళ్లడంతో ఆ వాహనం అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొద్ది దూరంలో ఆగిపోయింది. ఆ వ్యక్తి ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ విద్యుత్ స్తంభం విరిగి.. పూర్తిగా వంగింది. ఆ స్తంభానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో తాడిమర్రికి చెందిన రాము తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం అతను బైక్‌పై రాళ్ల అనంతపురం వెళ్లాడు. తిరిగి వస్తుండగా రామాపురం వద్ద కర్ణాటకకు చెందిన అభిషేక్ అనే వ్యక్తి రాయచోటికి కారులో వెళ్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాము తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని 108లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

క్రీడామైదానంలో చెత్త తొలగింపు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న నాయకులు

ధర్మవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజులపాటు సంబరాలు నిర్వహించారు. దీంతో ఆ మైదానం అంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ స్వచ్ఛ ధర్మవరం కార్యక్రమం పేరుతో గురువారం బీజేపీ నాయకులు, మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి ఆ మైదానాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు డోలా రాజారెడ్డి, శ్యామరావు, నబీరసూల్, మహేశ్ పాల్గొన్నారు.

చిరుత దాడి.. మేక మృతి

మడకశిరరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో రైతు నారాయణప్ప పొలంలో గురువారం చిరుత దాడిచేసి మేకను చంపినట్లు సర్పంచు గంగమ్మ,క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు తెలిపారు. కల్లుమర్రి పంచాయతీ పరిధిలో మూడు నెలలుగా చిరుత సంచరిస్తున్నట్లు ప్రజలు, రైతులు.. అటవీశాఖ అధికారుల దృష్టికి తెసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పొలాల వద్దకు వెళ్లే జాగ్రత్తగా ఉండాలని సర్పంచు కోరారు.

న్యూస్ బాక్స్

ఉపాధి కూలీలకు పనిముట్ల పంపిణీ



పనిముట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దంపతులు

గోరంట్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కూలీలకు పనుల పట్ల ఆసక్తి పెంచడానికి ఫీల్డు అసిస్టెంట్ నరేష్ సొంత ఖర్చుతో గురువారం పనిముట్లను అందించారు. మలసముద్రం పంచాయతీలో ఉపాధికూలీల కొరత తీవ్రంగా ఉంది. ఫీల్డు అసిస్టెంట్ వారిలో మార్పుకోసం వందరోజులు పనిచేసిన కూలీ కుటుంబాలకు సంక్రాంతి కానుకలు ప్రకటించారు. దీంతో ఉపాధి పనులకు 70మంది కూలీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కోరేవాండ్లపల్లిలో గురువారం గ్రామ సభ నిర్వహించి వందరోజులు పూర్తి చేసుకున్న 20 కుటుంబాల వారికి కానుకలిచ్చారు. సర్పంచ్ సువర్ణఅశ్వర్థరెడ్డి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఏపీఓ వరప్రసాద్ చేతుల మీదుగా గడారు, పార, బాడ్లి, చీర అందజేశారు. దీంతో కూలీల్లో సంతోషం వ్యక్తమైంది.

చేపల చెరువు వేలం

మలసముద్రం పంచాయతీ జక్కసముద్రం చేపల చెరువు వేలాన్ని సర్పంచ్ సువర్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వేలంపాటలో ఐదుగురు పాల్గొనగా కమలాకర్‌రెడ్డి రూ.33వేలకు పాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త, టీడీపీనాయకుడు అశ్వర్థరెడ్డి, ఉప సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, కార్యదర్శి మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి ప్రధాన రహదారిపై మురుగునీరు



ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

గోరంట్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కదిరి ప్రధాన రహదారిపై కసిరెడ్డిపల్లి ఎస్సీకాలనీ, ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాల మధ్య మురుగునీటిని రోడ్డుపైకి మళ్లించడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. తమ స్థలంలో నుంచి మురుగునీరు వెళ్లకూడదనే ఉద్దేశంతో కాలువ మట్టిని తొలగించారని తెలుస్తోంది. మురుగునీరు రోడ్డుపైకి పెద్ద ఎత్తున రావడంతో తారురోడ్డు పాడైపోయే అవకాశముంది. ఈ రహదారిలో జూనియర్ డిగ్రీ కళాశాలలు ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మురుగునీటి కారణంగా అందరికీ ఇబ్బంది కలుగుతోంది. వెంటనే అధికారులు రోడ్డు పక్కన మురుగునీటి కాలువ ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు త్యాగరాజస్వామి ఆరాధన

పెనుకొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నాదబ్రహ్మ త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు శనివారం స్థానిక సర్వశెట్టి కన్వెన్షన్ హాల్‌లో వృషభాద్రి గానబృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓప్రకటనలో తెలిపారు. ఆరాధనోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 6గంటలకు కర్ణాటక సంగీత గానకచేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గానకచేరికి భరద్వాజ్ వీణపైన, సుధీర్‌కుమార్, పుట్టపర్తి మృదంగంతోనూ వాయిద్య సహకారం అందిస్తారన్నారు.

మహిళపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా కార్యకర్తలు

సోమందేపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం మునిమడుగు గ్రామంలో మహిళపట్ల అమానుషంగా వ్యవహరించిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకులురాలు గౌతమి కోరారు. గురువారం మండల కేంద్రంలోని జేజేఆర్ నగర్‌లో కాలనీవాసులతో కలిసి ఆమె నిరసన తెలిపారు. మహిళపై దాడిచేసి జుత్తును కట్‌చేయడం హేయమైన చర్య అన్నారు. మంత్రి నియోజకవర్గంలో ఈ సంఘటన జరగడం, ఆమె స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు లలిత, అంబిక, రూప, పూజ పాల్గొన్నారు.

పెనుకొండ : మునిమడుగు గ్రామంలో వెంకటలక్ష్మిపై దాడికి పాల్పడి జుత్తు కత్తిరించి అవమానానికి పాల్పడిన దోషులను ఫ్యాప్టో చట్టం కింద అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ... మహిళపై దాడికి బరితెగించినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ప్రజలు

సోమందేపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీకి చెందిన వడ్డె వెంకటమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు సైతం చేయని పరిస్థితుల్లో ఉండటంతో కాలనీ ప్రజలు స్పందించి రూ.10,660 విరాళాలు సేకరించి అందజేశారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు.

మేకపై చిరుత దాడి

మడకశిర రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో రైతు నారాయణప్ప పొలంలో గురువారం చిరుత దాడిచేసి మేకను చంపినట్లు సర్పంచు గంగమ్మక్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు తెలిపారు. కల్లుమర్రి పంచాయతీ పరిధిలో మూడు నెలలుగా చిరుత సంచరిస్తున్నట్లు ప్రజలు, రైతులు.. అటవీశాఖ అధికారుల దృష్టికి తెసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పొలాల వద్దకు వెళ్లే జాగ్రత్తగా ఉండాలని సర్పంచు కోరారు.

డాక్టరులేని ఆసుపత్రులు

● ఇదీ ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ దుస్థితి

● మడకశిర నియోజకవర్గంలో రోగులకు తప్పని తిప్పలు



తాళం వేసిన మడకశిర యునాని ఆసుపత్రి

మడకశిర రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆయుష్ పరిధిలో ఉన్న యునాని, హోమియోపతి ఆసుపత్రులు డాక్టర్లు, సిబ్బంది లేక మూతబడుతున్నాయి. మడకశిర క్లస్టర్‌లోని ఐదు మండలాల పరిధిలో మడకశిర, కల్లుమర్రి, శంకర్‌గల్, మొరుబాగల్, రొళ్ళ, అమరాపురంలలో ఈ ఆయుష్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ఓ డాక్టరు, పార్మసిస్టు, వర్కర్ ముగ్గురు ఉంటారు. గతంలో ఇక్కడ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారికి మంచి చికిత్స అందించేవారు. కాని



మూతపడ్డ కల్లుమర్రి హోమియో ఆసుపత్రి

గత ఐదు ఏళ్లుగా ఈ ఆసుపత్రులలో డాక్టర్లు లేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేశామని అని గొప్పలు చెప్పుకొన్నారేగాని, ఈ ఆసుపత్రులకు డాక్టర్లను మాత్రం నియమించలేక పోయారని రోగుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

మడకశిరలో యునాని ఆసుపత్రి ఉంది. ఇందులో డాక్టరు, పార్మసిస్టు పనిచేస్తుండేవారు. రోగులకు కూడా మంచి సేవలు అందించారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డాక్టరు, పార్మసిస్టు బదిలీపై వెళ్లారు. వారు వెళ్ళిన ఏడాది తరువాత మరో పార్మసిస్టును మాత్రం నియమించారు. ఆయన కొద్ది కాలం పాటు మంచి సేవలు అందించి, ఆరునెలల క్రితం పదవీ విరమణ చేశారు. దీంతో మడకశిరలోని యునాని ఆసుపత్రి మూత బడింది.

కల్లుమర్రిలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో ఎనిమిదేళ్లుగా డాక్టర్ లేడు. నాలుగేళ్లపాటు పార్మసిస్టుతోనే ఈ ఆసుపత్రి నడిచింది. ఆయన ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో రెండేళ్లపాటు ఈ ఆసుపత్రి మూతబడింది. ఏడాదిక్రితం నియమితుడైన మరో పార్మసిస్టు డిప్యూటేషన్‌పై కొడిగేపల్లికి వెళ్లారు. దీంతో కల్లుమర్రిలో ఉన్న హోమియోపతి ఆసుపత్రి మరోసారి మూతబడింది. మిగిలిన ఆసుపత్రుల పరిస్థితి కూడా ఇదేవిధంగా తయారైంది. ఈ ఆసుపత్రులలో ఉన్న మందులు కూడా పాడైపోయాయి. దీంతో ఇక్కడ మందులు వాడే దీర్ఘకాలికరోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా ఇక్కడ డాక్టర్లను నియమించి ఆసుపత్రులను తిరిగి తెరవాలని ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్లను నియమించాలి..



వెంకట రంగారెడ్డి

ఆయుష్ ఆసుపత్రులకు డాక్టర్లను, సిబ్బందిని నియమించి రోగుల ఇబ్బందులను తొలగించాలి. కల్లుమర్రి హోమియోపతి ఆసుపత్రి మూతబడడంతో ఆ మందులు వాడే పలువురు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

● మంత్రి సవిత ● బీటీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

పెనుకొండ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ హయాంలో గ్రామీణ రోడ్లన్నీ నిర్వీర్యమయ్యాయి. గుంతలుపడ్డ రోడ్ల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నాడని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం రొద్దం మండలం నల్లూరు గ్రామం నుంచి దందేపల్లి క్రాస్‌వరకు రూ.1.18కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులక ఆమె భూమిపూజ చేశారు. ముందుగా రొద్దం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అదనపు భవన నిర్మాణానికి రూ.50లక్షలతో భూమిపూజ చేశారు. అనంతరం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.2.30లక్షలతో రైతు చెన్నకేశవులు నిర్మించుకున్న గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తున్నారన్నారు. రైతులకు గోకులం షెడ్లు, సబ్సిడీ పథకాలు, గ్రామీణ రోడ్లకు నిధుల మంజూరు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అభివృద్ధి అంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

మినీ గోకులం షెడ్డును ప్రారంభించిన మంత్రి

సోమందేపల్లి: మండలంలోని చాలకూరులో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మినీ గోకులం షెడ్డును గురువారం మంత్రి సవిత ప్రారంభించారు. రైతు చిరంజీవికి ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద రూ.1.16లక్షలు మంజూరుకావడంతో షెడ్డు నిర్మించారు. షెడ్డును ప్రారంభించిన మంత్రి అనంతరం చాలకూరు రైతు పరపతి సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులకు నాణ్యమైన ఎరువులను అందించారు. కార్యక్రమంలో నాయకులు డీవీ ఆంజనేయులు, భానుకిర్తీ, వెంకటరమణ, వెంకటేశులు, సూరి, అధికారులు ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఏపీడీ శివానందనాయక్, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి

అగళి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని అగళి మండలం హెచ్‌డిహళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైతులు గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు రామక్రిష్ణ, నరసింహరాజ్, అశ్వర్థ, తిప్పేస్వామి, వసంత్‌కుమార్, మంజునాథ్, లక్ష్మీనారాయణ, వీరభద్రప్ప, శివప్ప, దేవరాజు, బూతన్న, ప్రకాశ్, సిద్దన్న, తదితర 50మంది రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోవోల్టేజి సమస్య కారణంగా వారానికి రెండు మూడు మార్లు మోటార్లు కాలిపోతున్నాయని దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌డిహళ్లి సబ్‌స్టేషన్ నుండి ఇరిగేపల్లి, అగళి రావుడి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడంవల్ల లోవోల్టేజి సమస్య ఏర్పడిందన్నారు. గ్రామాల్లో ఏదైనా విద్యుత్ సమస్య ఏర్పడితే పరిష్కరించేవారే లేరని వాపోయారు. మూడు సార్లు ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టామని అయినా సమస్య పరిష్కరించలేదన్నారు. మోటార్లకు లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా పరిష్కరించాలని కోరుతూ రైతులు ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇన్‌చార్జి ఏఈ నిజాముద్దీన్ మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి విద్యుత్ సమస్యను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కాలిపోతున్న మోటార్లు, స్టార్టర్లు..

అమరాపురం: అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీ పరిధిలో అత్యధికంగా పంట పొలాలను సాగు చేసుకొన్నారని, అయితే లోఓల్టేజీ సమస్యలతో ప్రతి నిత్యం మోటార్లు, స్టార్టర్‌లు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ విద్యుత్ అధికారి మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఒకసారి మోటారు, స్టార్టర్ రెండూ ఒకేసారి కాలిపోతే దాదాపు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేనిఎడల విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు హనుమంతరాయ, శేఖరప్ప, అశ్వత్థనారాయణ, నరసింహమూర్తి, నింగేగౌడ్, తిప్పజ్జ, రమేష్, పాండురంగప్ప, శివన్న, మంజునాథ్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

దశాబ్దాలు గడిచినా చెర్లోపల్లికి మట్టిరోడ్డే దిక్కు

పెనుకొండ రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అదో మారుమూల గ్రామం, కొండకోనల్లో ఉంది. అక్కడ నివసించేవారంతా దళితులే. ఈ గ్రామంలో ఎన్నో దశాబ్దాల నుంచి కొంతమంది ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. వారి అభ్యున్నతి కోసం ఎవరూ చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఎందరు ప్రజాప్రతినిధులు మారినా నిర్లక్ష్యం వహిస్తున్నారని కొండకోనల్లో జీవనం సాగిస్తున్న చెర్లోపల్లి గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలోని రాంపురం పంచాయతీ చెర్లోపల్లి గ్రామం దశాబ్దాల క్రితం ఏర్పడింది. గ్రామంలో 50కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నారు. 200 మందిదాకా జనాభా ఉంది. 2012లో అప్పటి గ్రామ సర్పంచ్ పెనుకొండ నుంచి కొత్తచెరువు-పెనుకొండకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి చెర్లోపల్లికి వెళ్లే రోడ్డుకు కంకరవేసి ఆపై మట్టివేసి రోడ్డు నిర్మించారు. అయితే అది అనతికాలంలోనే ఛిద్రమైంది. ఛిద్రమైన రోడ్డులో ప్రయాణం నరకంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. దశాబ్దాలు గడిచినా తమకు మట్టిరోడ్డే దిక్కని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి పక్కారోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



అధ్వాన్నంగా చెర్లోపల్లికి వెళ్లే రోడ్డు

అనారోగ్యం బారిన పడితే దిక్కులేదు



ఆదెమ్మ, చెర్లోపల్లి

మా గ్రామానికి గత కొంతకాలంగా రోడ్డులేదు. ఎవరైనా అనారోగ్యం పాలైతే అంతే. కనీసం 108కూడా గ్రామానికి రాలేదు. ఆటోవారిని ఆశ్రయిస్తే రూ.500కు పైగా ఇస్తేనే గ్రామంలోకి వస్తారు. కొండంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే ఒక్కొక్కరికి రూ.600చొప్పున వెచ్చించి ఆటోలో పంపుతున్నాం.

అధికారులు ఇప్పటికైనా స్పందించాలి



రామాంజి, చెర్లోపల్లి

నేను పుట్టినప్పటి నుంచి మా గ్రామానికి రోడ్డు అధ్వాన్నంగానే ఉంది. ఎందరో వచ్చి రోడ్డు వేయిస్తామని మాటలు చెప్పారేగాని ఇంతవరకు రోడ్డువేసిన దాఖలాలులేవు. అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు వేయించాలి. లేకుంటే పిల్లలు చదువుకోలేరు. అనారోగ్యం చేస్తే చికిత్స అందదు.

పశువుల బెడదను నివారించండి

పెనుకొండ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

పెనుకొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో ఇటీవల కాలంలో పశువుల బెడద అధికంగా ఉందని, వాటిబెడద నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పట్టణంలో పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదిలిపెట్టడంవల్ల అవి స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇటీవల పశువులు అడ్డురావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై అందులో ఒకరు మృతిచెందారన్నారు. దీనిపై ఛైర్మన్ సమాధానం ఇస్తూ పశువులను రోడ్డుపై వదలరాదని యజమానులకు నోటీసు ఇచ్చారన్నారు. పశువులు రోడ్డుపై వచ్చారంటే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ సప్తగిరి, కమిషనర్ సతీష్‌కుమార్ వైస్ ఛైర్మన్ సునీల్‌కుమార్, మేనేజర్ నాగరాజు, ఆర్ఐ దినేష్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 42 కుటుంబాలు..



సర్పంచ్‌కు కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలో వైసీపీ పార్టీకి చెందిన 42కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. పెనుకొండ టీడీపీ కార్యాలయంలో వీరిని టీడీపీ కండువాలతో మంత్రి సవిత పార్టీలోకి ఆహ్వానించారు. రెడ్డిపల్లి సర్పంచ్ వినోద్‌కుమార్, అతనితోపాటు 28మంది కుటుంబాలు, మందలపల్లి నుంచి 13కుటుంబాలవారు పార్టీలోకి చేరారు. వీరందరికీ మంత్రి సవిత కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసీపీ సానుభూతి సర్పంచ్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పెనుకొండ వైసీపీలో గ్రూపురాజకీయాలు అధికమయ్యాయని ఒక వైపు ఉష, మరోవైపు శంకర్‌నారాయణ గ్రూపులతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే వైసీపీ పాలనలో సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని దీంతో అప్పుల పాలయ్యామన్నారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణచౌదరి, సుబ్బారెడ్డి, హరికుమార్, వృషభదేవుడు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను విస్మరించిన వైసీపీ



దేవేందర్ రెడ్డికి నిల్చిపోయిన భవనాలను చూపుతున్న గుండుమల

మడకశిర రూరల్, గుడిబండ జనవరి16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గురుకుల పాఠశాలను పూర్తిగా విస్మరించారని, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. గుండుమల తిప్పేస్వామి, బీసీ కార్పొరేషన్ ఎండీ దేవేందర్ రెడ్డితో కలిసి గురువారం గుండుమల, గుడిబండ గ్రామాల్లో పర్యటించారు. అర్ధంతరంగా ఆగిన గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. గతంలో టీడీపీ విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. పేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. గుండుమల, గుడిబండలో గురుకుల పాఠశాలలకు పక్కాభవనాలు నిర్మించారన్నారు. కేవలం 20 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అభివృద్ధిని మరచి కేవలం వసూళ్లపైనే దృష్టి పెట్టినట్లు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు అసంపూర్తిగా మిగిలిపోయిన గురుకుల పాఠశాల భవనాలు పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై .నిల్చిపోయిన గురులభవననిర్మాణాలను పూర్తిచేయలని సీఎం ఆదేశాలు ఇచ్చారన్నారు. అందులో భాగంగానే గురువారం గురుకుల భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ శివకుమార్, ఈఈ రమణారెడ్డి, టీడీపీ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణానికి ముందుకురావాలి



మాట్లాడుతున్న జపానందస్వామి

పావగడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద సందేశంతో నవభారత్ నిర్మాణానికి యువకులు కంకణం కట్టాలని రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి తెలిపారు. తుమకూరు యూనివర్సిటీలో జరిగిన స్వామివివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని స్వామిజీ మాట్లాడారు. నేటి యువత దేశప్రేమ, అభిమానం, నైతిక విలువలు, భక్తితో కూడిన విద్య జీవితంలో అలవాటు చేసుకోవాలని సూచించారు. మనిషి ఏదో ఒక పనిలో ఉంటే ప్రతీది సునాయాసంగా జరుగుతుందని ఆకతాయిగా ఉంటే ప్రతి ఒక్కటి కష్టంగా ఉంటుందని వివేకానంద స్వయంగా చెప్పి యువతకు ఒక సందేశాన్ని ఇచ్చారని ఆయన తెలిపారు. నవభారత్ నిర్మాణం యువతతోనే సాధ్యమని ఆదిశగా యువత కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి

రొళ్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల పరిధిలోని గుడ్డగుర్కి పంచాయతీ జి.ఎస్.పాళ్యం గ్రామంలో దళిత కాలనీకి ముఖద్వారం వద్ద బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ చేయడానికి స్థలం మంజూరు చేయాలని గురువారం మండల తహసీల్దార్ షేక్షావలికి దళితనాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త రంగస్వామి, రాఘవేంద్ర, బసవరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి

మడకశిరటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తుందని, దానిని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో యువతకు శిక్షణ ఇస్తుందన్నారు. ఆ సమయంలో ప్రతినెలా రూ.5వేలు ఆర్థిక సహాయం అందించి, ఎంపికైన వారికి రూ.6వేలు వన్‌టైం గ్రాంట్‌ను సైతం అందించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.